ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152
షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 260

శనివారం 03 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది



### మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన

### సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు

### మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 02)
కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు.

## అదే జరిగితే అణ్వాయుధాలు ప్రయోగిస్తాం: నాటోకు పుతిన్ హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 02)
ఇంటర్నెట్ డెస్క్: ఐరోపా దేశాలపై దాడి చేసే ఉద్దేశం తమకు లేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టంచేశారు. ఉక్రెయిన్ విషయంలో ఉద్రిక్తతలను పెంచొద్దని ఆయా దేశాలను కోరారు. మాస్కోలోని వాల్డాయ్ ఫోరంలో మాట్లాడుతూ.. "ఏ ఐరోపా దేశంపైనా దాడి చేసే ప్రణాళికలు రష్యాకు లేవు. వాటితో శాంతియుత సంబంధాలు కొనసాగించాలనుకుంటున్నాం. అయితే, కలినిన్‌గ్రాడ్ సహా ఇతర రష్యా భూభాగంపై ఐరోపా దేశాలు ప్రత్యక్ష దాడి చేస్తే మాత్రం ఊరుకునేది లేదు. అదే జరిగితే మా వద్ద ఉన్న అన్ని ఆయుధాలతో పాటు అణ్వాయుధాలనూ ప్రయోగిస్తాం" అని నాటో దేశాలను పుతిన్ హెచ్చరించారు. అదే సమయంలో తమపై ఉక్రెయిన్ జరిపే దాడులకు ఐరోపా దేశాలు మద్దతిచ్చినా.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

నాటో సభ్య దేశాలైన పోలాండ్, లిథువేనియా మధ్య ఉన్న కలినిన్‌గ్రాడ్.. రష్యాకు వ్యూహాత్మకంగా కీలకమని పుతిన్ పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని దిగ్బంధించడానికి కూటమి ప్రయత్నిస్తే.. తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అది ప్రపంచ దేశాలకే ప్రమాదమన్నారు. సైనికపరంగా నాటో రష్యాకంటే రెండింతలు పెద్దదని పుతిన్ గుర్తు చేశారు. ఫ్రాన్స్, బ్రిటన్‌ల వద్ద ఉన్న అణు సామర్థ్యాలపై తమకు పూర్తి అవగాహన ఉందన్నారు. అయినప్పటికీ ఈ పోటీలో తామే ఆధిక్యత సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. 2లో

## నాటి యువగళం హామీ.. నేడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా సాకారం!

### 'యువగళం' పాదయాత్ర హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

### రాయలసీమలో రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం

### మదనపల్లె వేదికగా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించిన సర్కార్

### 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో ఉద్యాన రైతులకు పూర్తిస్థాయి చేయూత

### ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 02)
'యువగళం' పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ రాయలసీమ రైతాంగానికి ఇచ్చిన కీలక హామీ కార్యరూపం దాల్చింది. రూ.1 లక్ష కోట్ల భారీ ప్రణాళికతో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా మార్చే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' (జీహెచ్‌హెచ్)కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మదనపల్లె వేదికగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే కాక, ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2లో

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

### రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ

### మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు

### రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 02)
రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్

## ఇక జన... చంద్రబాబు..!

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 02)
టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు.. ఇక నుంచి జన చంద్రబాబుగా మారనున్నారా? అంటే.. ప్రస్తుతం జరుగుతు న్న పరిస్థితులు పరిణా మాలను గ్రహిస్తే..ఔననే సమాధానమే వినిపిస్తోంది. బలమైన రాజకీయ పార్టీగానే కాకుండా.. బలమైన ప్రభుత్వాన్ని కూడా నడుపుతున్న చంద్రబాబు.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడంతోపాటు.. భావి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. దీంతో వరుస పర్యటనలు పెట్టుకుని ముందుకు సాగుతున్నారు.

ప్రతి రోజూ..ప్రతి రోజూ సీఎం చంద్రబాబు జిల్లాల్లో పర్యటించేలా వచ్చే 6 మాసాల వరకు(మధ్య స్థానిక ఎన్నికల కోడ్ వచ్చినా) షెడ్యూల్‌ను ఖరారు చేసుకున్నట్టు సీఎంవో వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి 75 ఏళ్ల వయసులో చంద్రబాబు ఇలా జిల్లాల్లో పర్యటించడం, ర్యాంప్ వాక్ చేయడం వంటివి ఆశ్చర్యంగానే ఉన్నా.. ప్రజలకు ఆయనను ఇవే భారీగా కనెక్ట్ చేస్తున్నాయి. ఒకప్పుడు నెలకోసారి మాత్రమే చంద్రబాబు జిల్లాల పర్యటనలు పెట్టుకునే వారు. కానీ, ఇప్పుడు రూట్ మార్చారు. ప్రతి రోజూ.. పర్యటనలు పెట్టుకుంటున్నారు.

## బ్యాలెట్ ఎలక్షన్స్ కు ఇండి కూటమి డిమాండ్.. జగన్ నిర్ణయమే కీలకం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 02)
ఎన్నికల కమిషన్ జ్ఞానేష్ కుమార్ వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలని ప్రతిపక్షం ఇండి కూటమి తీసుకున్న నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ప్రభావితం చేస్తుందా? అనే చర్చకు తెరలేపింది. ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీసేలా ఓట్లను చోరీ చేస్తున్నారని విపక్ష కూటమి పెద్ద ఎత్తున ఆందోళనలకు పిలుపునిచ్చింది. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఆరు దశల్లో విస్తరించాలని నిర్ణయించింది. అయితే జాతీయస్థాయిలో వివిధ ప్రాంతీయ పార్టీలు మద్దతు ప్రకటించిన ఈ ఉద్యమంపై వైసీపీ స్పందించకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుందని అంటున్నారు. దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని ఇండికూటమి ఆరోపిస్తుంటే, రాష్ట్రంలో ఈవీఎంల ట్యాంపిరింగ్ చేసి కూటమి అధికారంలోకి వచ్చిందని వైసీపీ ఆరోపిస్తోంది. ఈ విషయంలో గత రెండేళ్లుగా వైసీపీ, ఆ పార్టీ అనుబంధంగా పనిచేస్తున్న సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు ప్రచారం చేస్తున్నారు. వైసీపీ ఆరోపణలకు బలం చేకూర్చేలా విపక్షం కూడా దేశవ్యాప్తంగా ఉద్యమ 2లో



## నియామకాల్లో సమూల మార్పులు రావాలి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 02)
తక్షణ సేవల్ని ప్రపంచమంతా కోరుకుంటున్న ఈ ఏఐ రోజులకు తగ్గట్లుగా సంప్రదాయ సేవల వ్యవస్థలు మారాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. కృత్రిమ మేధ (ఏఐ) అప్పటికప్పుడు పరిష్కారాలను ఇస్తుండటంతో ప్రజలూ అదే స్థాయిని డిమాండు చేస్తున్నారని చెప్పారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఏర్పడి గురువారం నాటికి 100 ఏళ్లు పూర్తయ్యాయి. గత ఏడాది అక్టోబరు 1న ప్రారంభించిన శతాబ్ది వేడుకలు ముగిశాయి. దిల్లీలో ముగింపు సభలో ప్రధాని ప్రసంగించారు. "మన నియామకాల విధానంలో సమూల మార్పులు రావాలి. ఒక అభ్యర్థి విషయ పరిజ్ఞానాన్నే కాదు.. వారు సివిల్ సర్వీస్‌లో ఎందుకు చేరాలనుకుంటున్నారో, ప్రజా సేవా రంగాన్ని ఎంచుకునేందుకు ప్రేరణ ఏమిటో తెలుసుకోవాలి. అప్పుడే వారిని కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లోకి కాకుండా ప్రజా సేవలోకి తీసుకున్నట్లవుతుంది.

మన ప్రజలు, ముఖ్యంగా యువతలో కలలు, ఆకాంక్షలు ఎక్కువగా ఉంటాయి. దానికి తగ్గట్లు వ్యవస్థలో, సేవల్లో వేగం పెరగాలి. ఒక సేవ కోసం వారాలు, నెలలు నిరీక్షించే స్థితిలో ప్రజలు లేరు. వేలల్లో పత్రాలను ఏఐ క్షణాల్లో ప్రాసెస్ చేస్తోంది. రియల్ టైం డేటా ప్రభుత్వాలవద్ద ఉంటోంది. అందుకే ప్రజలూ వేగవంతమైన పరిష్కారాలను కోరుకుంటున్నారు. తరాలు, ప్రభుత్వాలు, సాంకేతికత, పాఠ్యాంశాలు మారినా యూపీఎస్సీపై విశ్వాసం చెక్కుచెదరలేదు. యూపీఎస్సీని దేశానికి కీలకంగా మార్చిన నేత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్. దేశ పునర్నిర్మాణానికి కావాల్సిన ఉక్కు చట్రాన్ని ఆయన అందించారు" అని మోదీ కొనియాడారు."నేనే బాస్‌ని అనే ధోరణితో అధికారులు పాలన సాగించే రోజులు కావివి. ప్రజలే దేవుళ్లు.. పౌరులే పరమావధి అనే భావనతో ఆధునిక పాలనా వ్యవస్థ నడుస్తోంది. రెండు గీటురాళ్లను మనం ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. 1) దేశమే ముందు 2) పౌరులకే అగ్రతాంబూలం. 2లో

## శాంతి దిశగా భారత్ ప్రపంచానికి మార్గం చూపించింది



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 02)
శాంతి, శ్రేయస్సు దిశగా భారత్ ప్రపంచానికి మార్గం చూపించిందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో దేశం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అభివృద్ధి–పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ–కుటుంబ జీవనం, మత విశ్వాసాలు–సంఘర్షణల మధ్య ఉన్న వైరుధ్యాలతో ప్రపంచ దేశాలు సతమతమవు తున్నాయన్నారు. వాటికి దిశానిర్దేశం చేసే శక్తి భారత్‌కు మాత్రమే ఉందని పేర్కొన్నారు. ముంబయిలో ఓ యువజన సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మాట్లాడారు.'అభివృద్ధి పెరిగేకొద్దీ పర్యావరణం దెబ్బతింటుంది. అలాగే పర్యావరణాన్ని రక్షించాల్సిన చోట అభివృద్ధి జరగదు. వ్యక్తిగత స్వేచ్ఛ పెరిగేకొద్దీ.. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఒకదానిని వదులుకుని.. మరోదానిని ఎంచుకోవడం ద్వారా ప్రపంచంలోని సంఘర్షణలను పరిష్కరించలేం. ఇందుకోసం వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ, మహాభారతాలు, 2లో

# కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు.

ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

# అదే జరిగితే అణ్వాయుధాలు ప్రయోగిస్తాం: నాటోకు పుతిన్ హెచ్చరిక

నల్ల సముద్ర ప్రాంతంలోని ఉక్రెయిన్ లక్ష్యాలపై దాడులను నిలిపివేసే ప్రసక్తే లేదని పుతిన్ స్పష్టం చేశారు. మాస్కోలోని చమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ జరిపిన దాడుల వల్ల తమ జీడీపీలో సుమారు 1శాతం నష్టం వాటిల్లిందన్నారు. నాటో విస్తరణ, ఐరోపా దేశాల జోక్యం వల్లే ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతోందన్నారు.

# నాటి యువగళం హామీ.. నేడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా సాకారం!

**రూ. లక్ష కోట్లతో సమగ్ర ప్రణాళిక**

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి అదనంగా, ప్రైవేట్ రంగం నుంచి మరో రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించారు. 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో విత్తనం వేసిన దగ్గర నుంచి పంటను ఎగుమతి చేసే వరకు ప్రతి దశలోనూ ఉద్యాన రైతులకు అండగా నిలవడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖలతో సమీక్షలు జరపడంతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చేలా ఒప్పించారు.

## మొదటిపేజీ తరువాయి

**పాదయాత్రలో చూసి.. మిషన్ రాయలసీమగా మార్చి..**

గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చరిత్రాత్మక పాదయాత్ర చేపట్టారు. రాయలసీమలో 124 రోజుల పాటు 1,587 కిలోమీటర్లు నడిచి, 44 నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆ సమయంలో లక్షలాది మంది రైతులను నేరుగా కలిసి వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. వారి ఇబ్బందులు చూసి చలించిపోయిన లోకేశ్.. 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని భరోసా ఇచ్చారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ, ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి హామీలను ఆనాడు ఇచ్చారు.

**కరవు సీమ నుంచి ఫలాల సీమగా..**

ఒకప్పుడు కరవుకు చిరునామాగా ఉన్న రాయలసీమ, ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా దేశంలోనే అగ్రగామి ఉద్యాన ప్రాంతంగా మారనుంది. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, బొప్పాయి, స్వీట్ ఆరెంజ్ వంటి సంప్రదాయ పంటలతో పాటు ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్ బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన కొత్త రకం పంటల సాగుకు ప్రోత్సాహం లభించనుంది. ఈ బృహత్తర ప్రాజెక్టు రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనుంది.

# బ్యాలెట్ ఎలక్షన్స్ కు ఇండి కూటమి డిమాండ్.. జగన్ నిర్ణయమే కీలకం

కార్యాచరణకు పిలుపునివ్వడంతో వైసీపీ కూడా వారితో చేతులు కలుపుతుందా? అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కేంద్రంలో తటస్థ వైఖరి అనుసరిసరిస్తున్నప్పటికి, అవసరమైన సందర్భాల్లో బీజేపీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్న వైసీపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఇప్పుడు వ్యతిరేక వైఖరి తీసుకునే అవకాశాలు ఏమైనా ఉన్నాయా? అని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.గత ఎన్నికల్లో ఈవీఎంలను మేనేజ్ చేసి కూటమి అధికారంలోకి వచ్చిందని, తమ విజయాన్ని లాక్కుందని ఇన్నాళ్లు ఆరోపణలు చేసిన వైసీపీకి ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఉద్యమించి, ప్రజలల్లో ఆలోచనలు రేకెత్తించే అవకాశం విపక్షాల ద్వారా లభించిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. విపక్ష కూటమితో చేతులు కలిపి తమ రాష్ట్రంలోనూ ఓటు చోరీ జరిగిందని వైసీపీ చెబుతుందా? లేకపోతే గతంలో తాము చేసిన విమర్శలను తొక్కిపెట్టి బీజేపీ అనుకూల విధానం పాటిస్తుందా? అనేదానిపై ఆసక్తి రేగుతోందని అంటున్నారు. రాజకీయంగా లబ్ధి పొందాలంటే విపక్షంతో చేతులు కలపక తప్పదని, అలా జరిగితే కేంద్రం తీసుకోబోయే పరిణామాలు ఎలా ఉంటాయనేది వైసీపీ ముందుగా తేల్చుకోవాలని అంటున్నారు.మొత్తానికి ఈ విషయంలో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి తీసుకోబోయే నిర్ణయమే ఆయన భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించనుందని అంటున్నారు. ఈవీఎంలపై ఆరోపణలకు కట్టుబడితే విపక్షంతో కలిపి ఉద్యమంలో పాల్గొంటారా? కనీసం తన పార్టీ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటిస్తారా? అనేదానిపైన చర్చ జరుగుతోంది. అయితే ఇటీవల ఎన్నికల కమిషన్ లో భేదాభిప్రాయాలు ఉన్నాయని జాతీయ మీడియాలో కథనాలు వచ్చిన సమయంలో జగన్ చేసిన ట్వీట్ ను పరిశీలకులు ప్రస్తావిస్తున్నారు. ఎన్నికల కమిషన్ తన పారదర్శకతను నిరూపించుకోవాలని జగన్ సూచించడం ద్వారా విమర్శలకు అవకాశం ఇవ్వకుండా చాకచక్యంగా వ్యవహరించారని అంటున్నారు. ఇప్పుడు కూడా విపక్షం ఇండి కూటమి పిలుపునిచ్చిన ఆందోళనలను తనకు అనుకూలంగా మల్చుకోవాలా? లేక ఆ ఉద్యమానికి తమ పార్టీ రాజకీయానికి సంబంధం లేనట్లు మౌనం వహించాలా? అనేది జగన్ తేల్చుకోవాల్సివుంటుందని అంటున్నారు.

# రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# శాంతి దిశగా భారత్ ప్రపంచానికి మార్గం చూపించింది

సాధువుల బోధనల నుంచి భారత్‌కు వచ్చిన జ్ఞానం ప్రపంచానికి చాలా అవసరం. మన దేశం, ధర్మం వేర్వేరు కావు. దేశాన్ని నిలబెట్టడంలో ధర్మం సహాయపడుతుంది. దేశం బలహీనపడితే ధర్మానికి ముప్పు వాటిల్లుతుంది. ఆ రెండింటినీ ముందుకు తీసుకువెళ్లడమే మన బాధ్యత. ఏ దేశంపై దాడి చేయకుండా.. ఎవరినీ తన నియంత్రణలోకి తీసుకోకుండా భారత్ ఎన్నో ఏళ్లుగా శాంతి, సంతోషాలతో ముందుకు వెళ్తోంది' అని భాగవత్ పేర్కొన్నారు.

# నియామకాల్లో సమూల మార్పులు రావాలి

ప్రజానుకూలత, క్రియాశీలత, సుపరిపాలన అనేవి 3 మూలస్తంభాలుగా ఉండాలి. పరీక్షలు నిర్వహించే సంస్థలు నియామక ప్రక్రియ వ్యవధిని కుదించే ప్రయత్నం చేయాలి. సుదీర్ఘంగా పరీక్షల తేదీలుంటే కోచింగ్ రుసుం, అద్దె, రవాణా ఖర్చులవంటివన్నీ భారమవుతాయి" అని మోదీ సూచించారు. యూపీఎస్సీ సెంటినరీ ప్రత్యేక నాణేన్ని, తపాలా బిళ్లను, పుస్తకాన్ని మోదీ ఆవిష్కరించారు.

# గాంధీజీ అడుగుజాడల్లో నడవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి

### కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు పివిఎన్ ప్రసాద్

### బద్వేల్‌లో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 2)





మహాత్మా గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన చూపిన సత్యం, అహింసా మార్గంలో నడవడమే ఆ మహనీయునికి ఇచ్చే నిజమైన నివాళి అని కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షుడు పివిఎన్ ప్రసాద్, కెవి సుబ్బారావు సెక్రటరీ సివి నాగేశ్వరరావు ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వల్లంకొండు వెంకటరమణ సూచనల మేరకు శుక్రవారం బద్వేల్ పట్టణంలో మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గాంధీజీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు పివిఎన్ ప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం, ఆయన అందించిన శాంతియుత మార్గం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. నేటి యువత గాంధీజీ సిద్ధాంతాలను ప్రేరణగా తీసుకొని సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా సంక్షేమ సంఘం వైస్ చైర్మన్ సంజీవిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కోటా సుమన్, జిల్లా వాణిజ్య విభాగం చైర్మన్ తులసి నాగరాజ,మెడికల్ కమిటీ చైర్మన్ దర్శి సుబ్బరాజా, అడ్వకేట్ కమిటీ చైర్మన్ పత్తి నాగేంద్రప్రసాద్, జిల్లా గౌరవ సలహాదారులు తులసి వెంకట శివ నారాయణ, తుమ్మలపెంట సురేష్ బాబు, జిల్లా వాణిజ్య విభాగం వైస్ చైర్మన్ కొలిశెట్టి వెంకటసుబ్బయ్య, జాయింట్ ట్రెజరర్ మల్లెముల నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు వైభవ్ ప్రసాద్, స్టేట్ యువజన విభాగం కమిటీ సెక్రటరీ తుమ్మలపెంట సుప్రశ్రీకర్, గాజులపల్లె నరసింహ, ఉద్యోగుల కమిటీ వైస్ చైర్మన్ పబ్బతి చక్రపాణి, వాణిజ్య విభాగం వైస్ చైర్మన్ దొంతంశెట్టి జయ కుమార్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బచ్చు సుధాకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొలిశెట్టి సుబ్బారావు, జాయింట్ సెక్రెటరీ జొన్నలగడ్డ సుధాకర్, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త బచ్చు సుబ్రమణ్యం, మహిళా మండలి ట్రెజరర్ దేవతి లలిత, జిల్లా జాయింట్ సెక్రెటరీ చింతకుంట ధనమ్మ, బచ్చు పార్వతమ్మ, కోటేశ్వరమ్మ వెంకటసుబ్బమ్మ, జిల్లా యువజన సంఘం ట్రెజరర్ పైడిమర్రి సురేష్‌బాబు తో పాటు పలువురు జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని, గాంధీజీ చెప్పిన నిరాడంబరత, స్వదేశీ భావనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, సభ్యులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని గాంధీజీ సేవలను స్మరించుకున్నారు.

# శ్వేత నాట్య అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారుల అరంగేట్రం





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, అక్టోబర్ 2)

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్య కళారాధనలో) గురువారం రాత్రి మార్కాపురం పట్టణానికి చెందిన శ్వేత నాట్య అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద గురువారం సాయంత్రం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపతి ప్రార్ధన, శివకృతి, శివ తాండవం, శివాష్టకం, తదితర గీతాలకు, అష్టకాలకు భవిష్య, హర్షితప్రియ, గాయత్రి, దివ్య మహాలక్ష్మి, చరణ్యశ్రీ, అభిజ్ఞ, ఊహశ్రీ తదితరులు నృత్య ప్రదర్శన చేసి అరంగేట్రం చేశారు. అలాగే రెండవ కార్యక్రమంలో భాగంగా చిగురు ట్రస్ట్, బెంగుళూరు, కర్ణాటక వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాంగా ఈ నిత్యకళారాధన కార్య క్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా శ్వేత నాట్య అకాడమి డైరక్టర్ శ్వేత శ్రీనివాస్ కొలిశెట్టి మాట్లాడుతూ తన ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారుల అరంగేట్రంతో పాటు నృత్య ప్రదర్శనకు వచ్చిన చిన్నారులకు ఉచితంగా వసతి, ఇతర సౌకర్యాలు కల్పించిన శ్రీశైలం దేవస్థాన అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం చిన్నారులు తమ నాట్య గురువు శ్వేత శ్రీనివాస్ కొలిశెట్టి ని శాలువాతో సత్కరించి ఆమె ఆశీర్వచనాలు అందుకున్నారు.



